---

అందమైన తీగకు పందిరుంటె చాలును

పైకి పైకి పాకుతుంది చినదానా.. పరవశించి సాగుతుంది చినదానా

|| అందమైన తీగకు ||

గువ్వకెగిరే కోరికుంటే రెక్కలొస్తాయి తప్పటడుగులే ముందు ముందు నడకలౌతాయి

ఆశ ఉంటే మోడు కూడా చిగురు వేస్తుంది అందమున కానందమపుడే తోడువస్తుంది

|| అందమైన తీగకు ||

పాదులోని తీగవంటిది పడుచుచిన్నది పరువమొస్తే చిగురు వేసి వగలుబోతుంది

మొగ్గ తొడిగీ మురిసిపోతూ సిగ్గు పడుతుందీ తగ్గ జతకై కళ్లతోటే వెతుకుతుంటుంది

|| అందమైన తీగకు ||

కళ్లు కళ్లు కలిసినపుడు కలలు వస్తాయి కన్నెపిల్ల కలలకెపుడో కాళ్లు వస్తాయి

అడుగులోన అడుగు వేస్తూ అందమొస్తుంది నడవలేని నడకలే ఒక నాట్యమౌతుంది

|| అందమైన తీగకు ||



Contributed By: Narayana Swamy

www.telugulyrics.org